సాక్షి అనంతపురం

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38వేలు పలికాయి.



టమాట కిలో రూ.5.50

కక్కలపల్లి మండీలో సోమవారం టమాట ధర గరిష్టంగా రూ.5.50, కనిష్టం రూ.2.50, సరాసరిన రూ.4 చొప్పున పలికింది.

గరిష్టం/కనిష్టం
41.9°/24.2°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

27న జిల్లా జైల్లో వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లా జైలులో ఈ నెల 27న వేరుశనగ చెక్క వేలం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ జైళ్ల శాఖ ఉప శాఖాధికారి కడప రేంజ్ వారి సమక్షంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు 20వేల కేజీల వేరుశనగ చెక్క వేలం వేస్తామని, ఆసక్తి ఉన్న వారు రూ.17,600 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వేలం పాట ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కి చెల్లిస్తామని తెలిపారు.

వారికి మరో ఛాన్స్!

- డీఎస్సీ-98 కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారికి 27న కౌన్సెలింగ్



రాప్తాడు రూరల్: డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఇటీవలే మినిమం టైం స్కేల్‌తో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా అవకాశం కల్పించారు. కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారికి ప్రభుత్వం మరో ఛాన్స్ ఇచ్చింది. ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థులు మొత్తం 536 మంది మెరిట్ జాబితాలో ఉన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించిన నియామక కౌన్సెలింగ్‌కు 488 మంది అభ్యర్థులు హాజరై ఉద్యోగాలు పొందారు. తక్కిన 48 మంది గైర్హాజరయ్యారు. వారికి ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చిందని డీఈఓ పేర్కొన్నారు. ఈనెల 27న అనంతపురం డీఈఓ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాల్‌టికెట్, విద్యార్హత పత్రాలు (ఒరిజనల్), గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన పత్రాలు ఒక సెట్టు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని రావాలని డీఈఓ ఎం.సాయిరామ్ సూచించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న వీఆర్వో

గుత్తి రూరల్: టి.కొత్తపల్లిలో నాగమ్మ (103) అనే శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. మాజీ సర్పంచ్ పెద్ద కృష్ణ మాతృమూర్తి నాగమ్మ వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధ పడుతుండేది. ఈ క్రమంలో సోమవారం వేకువజామున నిద్రలోనే నాగమ్మ తుదిశ్వాస విడిచారు. ఈమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లతో పాటు మనవళ్లు మనవరాళ్లు 40 మంది దాకా ఉన్నారు. నాగమ్మ మృతదేహానికి వైఎస్సార్ సీపీ నాయకుడు రంగయ్య, వీఆర్వో నాగరాజు నివాళులర్పించారు.

రేపు సీఎం పర్యటన







ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, డీఐజీ, ఎస్పీ, జేసీ

- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- నార్పలలో 'వసతి దీవెన' కార్యక్రమం
- లబ్ధిదారులతో సీఎం జగన్ ముఖాముఖి

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో నిర్వహించనున్న జగనన్న వసతి దీవెన కార్యక్రమంలో పాల్గొని కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తారు. సీఎం పర్యటన షెడ్యూల్‌ను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. బుధవారం ఉదయం 9.45 గంటలకు సీఎం జగన్ శ్రీసత్య సాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఉదయం 10 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి అనంతపురం జిల్లా నార్పలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 10.20 గంటలకు చేరుకుంటారు. 10.30 గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయల్దేరి నార్పల క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి 10.40 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని 10.55 గంటల వరకు సందర్శిస్తారు. 11 గంటలకు సభా వేదికపైకి చేరుకుని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జగనన్న వసతి దీవెన కార్యక్రమం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. జగనన్న వసతి దీవెన మెగా చెక్కును విడుదల చేస్తారు. మధ్యాహ్నం 12.35 గంటలకు సభాస్థలి వద్ద నుంచి బయల్దేరి హెలిప్యాడ్‌కు 12.45 గంటలకు చేరుకుంటారు. అక్కడే స్థానిక నాయకులతో 1.05 గంటల వరకు మాట్లాడతారు. 1.10 గంటలకు హెలికాప్టర్ ద్వారా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. 1.40 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయల్దేరి వెళతారు.

విజయవంతం చేయాలి

శింగనమల/ నార్పల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నార్పలలో సీఎం సభా ప్రాంగణ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆలూరు సాంబశివారెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం హోదాలో తొలిసారి వస్తున్న నేపథ్యంలో ఘనంగా స్వాగతం పలికేందుకు శింగనమల నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు ముఖ్యమంత్రి రాక కోసం ఎదురుచూస్తున్నారన్నారు. పేద పిల్లలు చదువుకుంటేనే తల రాతలు మారుతాయన్న నమ్మకంతో సీఎం పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను 'నాడు-నేడు' ద్వారా రూపురేఖలు మార్చి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచారన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ల్యాప్‌టాప్‌ల ద్వారా డిజిటల్ బోధన వంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

సీఎం పర్యటన ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రాజారెడ్డి సోమవారం పరిశీలించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఎండ వేడి తగలకుండా కూలర్లు సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, సింగిల్ విండో ప్రెసిడెంట్ లోకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1200 మందితో బందోబస్తు

సీఎం పర్యటన నేపథ్యంలో నార్పల ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను కలెక్టర్ గౌతమి, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ కేతన్‌గార్గ్ పరిశీలించారు. అక్కడి నుంచి సభా ప్రాంగణం వరకు మార్గాన్ని పరిశీలించి.. రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న వసతి దీవెన కార్యక్రమం ప్రారంభోత్సవానికి సీఎం వస్తున్నారని, ఇప్పటికే ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. సీఎం పర్యటనకు 1200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. ఎక్కడా లోటుపాట్లు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఆర్డీవోలు మధుసూదన్, నిషాంత్‌రెడ్డి, రవీంద్ర, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



నార్పలలో ముఖ్యమంత్రి సభ కోసం సిద్ధమైన ఏర్పాట్లు

ప్రజలకు సత్వర సేవలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

అనంతపురం అర్బన్: ప్రజలకు సత్వరమే సేవలందించేలా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రిదేవి, డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సుధారాణి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 389 అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే క్రమంలో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యం కనిపించకూడదన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పరిష్కారం కాని సమస్య అయితే అదే విషయాన్ని తెలియజేస్తూ ఎండార్స్‌మెంట్ ఇవ్వాలే తప్ప పరిష్కరించినట్లుగా చూపించకూడదన్నారు. అర్జీల పరిష్కారంపై అధికారులు రోజూ సిబ్బందితో సమీక్షించాలని ఆదేశించారు.

కొన్ని వినతులు ఇలా....

- జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద రూ.20 వేలు చెల్లించి రెండేళ్లవుతున్నా ఇంటి పట్టా ఇవ్వలేదని కురుగుంట గ్రామం గురవయ్య కాలనీకి చెందిన ఎం.తులశమ్మ ఫిర్యాదు చేశారు. ఈమె సమస్యపై తహసీల్దార్ శ్రీధర్ మూర్తి సంబంధిత సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. వారు ఏదో కారణం చెప్పే ప్రయత్నం చేయగా.. ఆయన అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే తులశమ్మకు పట్టా అందజేయాలని ఆదేశించారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సీట్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప విన్నవించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 16 గురుకుల పాఠశాలల్లో 1,200 సీట్లు ఉండగా.. 10,043 మంది విద్యార్థులు సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యార్థులకు అనుగుణంగా సీట్ల పెంపుపై ప్రభుత్వానికి నివేదిక పంపించి సమస్య పరిష్కరించాలని కోరారు.
- మురుగు కాలువ లేక ఇబ్బంది పడుతున్నామని తాడిపత్రి మండలం భోగసముద్రం పంచాయతీ బుగ్గ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు విన్నవించారు. కాలనీలో కాలువ నిర్మాణానికి ఎంపీడీఓ అనుమతి ఇచ్చారన్నారు. అయితే కాలువ నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోలేదన్నారు.

జీసీడీఓ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ) పోస్టుకు డిప్యుటేషన్‌పై పని చేసేందుకు అర్హులైన మహిళా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, డైట్ కళాశాల లెక్చరర్లు దరఖాస్తు చేసుకోవచ్చని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి, డీఈఓ సాయిరామ్ కోరారు. http://samagrashikshaatp.blogspot.com నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని పూరించిన తర్వాత, ఈనెల 26న సాయంత్రం 5 గంటల్లోపు సమగ్ర శిక్ష డీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం

- సచివాలయ వ్యవస్థతో దేశానికే ఏపీ రోల్ మోడల్
- పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం
- సంపద సృష్టించుకునేస్థాయికి పంచాయతీలు ఎదగాలి : కలెక్టర్

అనంతపురం సిటీ: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. స్వచ్ఛమైన గ్రామీణ సంస్కృతికి, శ్రేయస్సుకు సచివాలయ వ్యవస్థ జీవం లాంటిదని పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా పరిషత్ సమావేశ భవన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ ప్రసంగిస్తూ ఒక గ్రామంలో సమస్య ఉంటే మండలానికో, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సిన అవసరం లేకుండా సచివాలయ పరిధిలోనే పరిష్కారం లభించేలా సరికొత్త వ్యవస్థను విజయవంతంగా అమలు చేయడంలో మన రాష్ట్రం దేశానికే రోల్‌మోడల్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. గ్రామస్థాయిలో జరిగే కార్యక్రమాలకు ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంతంగా ఆదాయాన్ని సమకూర్చుకొని ఖర్చు చేసే స్థాయికి పంచాయతీలు ఎదగాలని ఆకాంక్షించారు. సంపద సృష్టి పల్లెల్లోనే జరగాలని పిలుపునిచ్చారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపించే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఆదర్శంగా నిలవడం జగన్ పాలనాదక్షతకు నిదర్శనమని కొనియాడారు. రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్న ఉమ్మడి జిల్లాకు చెందిన మేడాపురం(చెన్నేకొత్తపల్లి మండలం), కట్టకిందపల్లి(అనంతపురం రూరల్) సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా పలువురు అధికారులు తమ సందేశాన్నిచ్చారు. అనంతరం తొమ్మిది కేటగిరీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన 18 మంది సర్పంచులకు (అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి, ఆలమూరు, కట్టకిందపల్లి, ఆత్మకూరు మండలం వడ్డుపల్లి, పంపనూరు, విడపనకల్లు మండలం గడేకల్లు, విడపనకల్లు, పామిడి మండలం ఎద్దులపల్లి, ఉరవకొండ మండలం బూదగవి, ఇంద్రావతి, బొమ్మనహాళ్ మండలం నేమకల్లు, డి.హొన్నూరు, కుందుర్పి మండలం కుందుర్పి, మహంతపురం, గుమ్మఘట్ట మండలం గుమ్మఘట్ట, యాడికి మండలం ఎన్.చిక్కేపల్లి, కూడేరు మండలం ఇప్పేరు, శింగనమల మండలం శింగనమల పంచాయతీ) కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ అమృతరాజ్, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ యమ్మాని భాగ్యరాజ్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



సర్పంచులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

మలేరియా గండం తప్పింది

- ఏడాదిలో 2.34 లక్షల నమూనాల్లో 13 కేసులే నమోదు
- 2030 నాటికి పూర్తిగా నిర్మూలనవుతుందన్న అధికారులు
- నేడు ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మలేరియా నుంచి గండం తప్పింది. కేసులు పూర్తిగా తగ్గాయి. ఆడ ఎనాఫిలీస్ దోమ కుట్టడం వల్ల వచ్చే ఈ మలేరియా జ్వరం ఒకప్పుడు అతిపెద్ద ప్రమాదకరంగా ఉండేది. ఊళ్లకు ఊళ్లే మలేరియా జ్వరంతో మంచమెక్కిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడా పరిస్థితి నుంచి పూర్తిగా ఉపశమనం కలిగింది. జిల్లాలో గత ఏడాది 2.34 లక్షల నమూనాలు తీసి పరిశీలించగా 13 కేసులు మాత్రమే నమోదైనట్టు జిల్లా ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఈ ఏడాది అంటే 2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకూ 62వేలకు పైగా నమూనాలు తీయగా ఒక్క కేసు మాత్రమే పాజిటివ్‌గా నమోదైనట్టు తేలింది.

పోలియో, మశూచి తరహాలోనే మలేరియా నిర్మూలన..

దేశంలో ఇప్పటి వరకూ పోలియో, మశూచి వ్యాధులను పూర్తిగా నిర్మూలించారు. ఇప్పుడు దోమకాటు ద్వారా వచ్చే మలేరియానూ కూడా అదే తరహాలో నిర్మూలించే దశకు వచ్చినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. 2027 నాటికి ఈ వ్యాధిని పూర్తిగా అరికట్టాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నారు. మలేరియాకు కారణమయ్యే దోమల వృద్ధికి ఆస్కారం లేకుండా చేయడం వల్లే వ్యాధి అదుపులోకి వచ్చింది. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా పరిశుభ్రమైన వాతావరణం ఉంటే మలేరియా దోమలు మనగలగలేవని వైద్యులు చెబుతున్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి

అత్యంత ప్రమాదకరం..

మలేరియా అత్యంత ప్రమాదకరమైనది. గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 241 మిలియన్ మలేరియా కేసులు నమోదు కాగా 6.27 లక్షల మంది మృత్యువాత పడ్డారు. ఇప్పటికీ ఆఫ్రికా దేశాలను ఈ జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. దోమ కుట్టిన మూడు లేదా నాలుగు రోజుల్లో జలుబు, ఆ తర్వాత జ్వరం రావడం.. ఇది తీవ్రమై మెదడుకు పాకడం వంటివి జరిగేవి. ఎక్కువగా చిన్నారులు దీనివల్ల మృత్యువాత పడుతున్నట్టు తేలింది. సకాలంలో గుర్తించి వైద్యం అందించకపోతే ప్రాణాపాయం జరుగుతుంది. అంతటి ప్రమాదకరమైన ఈ మలేరియాను నిర్మూలన దశకు తీసుకురావడం గొప్ప విజయమని వైద్యులు చెబుతున్నారు.

మలేరియా నివారణే లక్ష్యం

అనంతపురం అర్బన్: జిల్లాలో మలేరియా వ్యాధి నివారణే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేయాలని అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం నిర్వహిస్తున్న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని వైద్య, విద్య, స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీ శాఖలు సంయుక్తంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్వో గాయత్రీదేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబుళు, అధికారులు సత్యనారాయణ, గిరిధర్‌రెడ్డి, మద్దయ్య, నూర్ బాషా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

2022లో జిల్లాలో మలేరియా కేసులు ఇలా..

నెల	నమూనాలు	పాజిటివ్ కేసులు
జనవరి	13,733	0
ఫిబ్రవరి	15,494	0
మార్చి	19,673	0
ఏప్రిల్	19,594	0
మే	23,691	1
జూన్	16,714	1
జులై	24,216	1
ఆగస్ట్	20,143	1
సెప్టెంబర్	20361	5
అక్టోబర్	23,349	2
నవంబర్	17,715	0
డిసెంబర్	20,286	2

నిర్మూలన దశలో ఉంది

అనంతపురం జిల్లాలో మలేరియా నిర్మూలన దశలో ఉంది. లక్షల్లో నమూనాలు సేకరించగా 13 కేసులు నమోదయ్యాయి. దోమకాటు వల్ల వచ్చే ఈ వ్యాధిపై కనీస అవగాహన ఉంటే చాలు త్వరలోనే నిర్మూలించవచ్చు. ఆ దిశగా కృషి చేస్తున్నాం.
– డి.ఓబులు, జిల్లా మలేరియా అధికారి

సాయినామం.. భక్త పరవశం



అలంకరణలో సత్యసాయి మహా సమాధి



మహానారాయణ సేవ, వస్త్రాల పంపిణీ చేపడుతున్న రత్నాకర్‌రాజు తదితరులు

- ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవాలు

ప్రశాంతి నిలయం: సత్యసాయి నామ స్మరణతో ప్రశాంతి నిలయం ప్రతిధ్వనించింది. సత్యసాయి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 8 గంటలకు వేదపఠనంతో వేడుకలు ప్రారంభంకాగా, సత్యసాయి మిర్‌పురీ కళాశాల విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ పంచరత్న కీర్తనలు ఆలపించారు. కర్ణాటక సంగీత రీతిలో సత్యసాయిపై భక్తిప్రపత్తులను చాటుతూ సాగిన కచేరీతో భక్తులు మైమరచిపోయారు. సాయికుల్వంత్ సభామందిరం ఆధ్యాత్మిక పరిమళాలతో నిండిపోయింది.

బోధన మననం చేసుకోవడమే ఆరాధన..

ఆరాధనోత్సవాల్లో భాగంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద భక్తులనుద్దేశించి ప్రసంగించారు. శ్రవనం, మననం, ఆచరణం మూడింటినీ కలిగి ముందుకు సాగడమే ఆరాధన అన్నారు. ప్రతి సాయి భక్తుడూ తాము విన్న సత్యసాయి బోధనలను మననం చేసుకుంటూ నిత్యజీవితంలో అచరించడమే సరైన ఆరాధన అన్నారు. భక్తులపై సత్యసాయి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. అనంతరం సత్యసాయి ఎవరు అన్న సారాంశంతో కూడిన 'త్వమేవ చరణం మమ'అన్న పుస్తకాన్ని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు నాగానంద, జేవీ శెట్టి, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, దేశీయ అధ్యక్షుడు నిమీష్ పాండే ఆవిష్కరించారు. సత్యసాయి పూర్వపు ప్రసంగాలను డిజిటల్ స్క్రీన్‌లపై వినిపించారు. భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మహానారాయణ సేవలో 30 వేల మంది..

సత్యసాయి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ హిల్‌వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. కరోనా కారణంగా మూడేళ్లుగా నిలిచిపోయిన నారాయణ సేవను ఈ ఏడాది ఆరాధనోత్సవాలతో ట్రస్ట్ తిరిగి ప్రారంభించింది. పుట్టపర్తి పరిసర గ్రామాలకు చెందిన 30 వేల మంది భక్తులు ఉదయం నుంచే హిల్‌వ్యూ స్టేడియానికి చేరుకున్నారు. భక్తులకు ఎండవేడిమి వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ట్రస్ట్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఉదయం 10 గంటలకు అన్నదాన కౌంటర్ల వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి చిత్రపటం వద్ద ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యులు నాగానంద, జేవీ శెట్టి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహానారాయణ సేవ ప్రారంభించారు. ట్రస్ట్ సభ్యులు భక్తుల వద్దకు వెళ్లి స్వయంగా అన్న ప్రసాదాలు, నూతన వస్త్రాలను వితరణ చేశారు. డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

సత్యసాయి ఆయశ సాధనే ట్రస్ట్ లక్ష్యం..

సత్యసాయి ఆశయ సాధనే లక్ష్యంగా సెంట్రల్ ట్రస్ట్ ముందుకు సాగుతోందని, అందులో బాగంగా సత్యసాయి చేపట్టిన ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు ఎలాంటి అటంకం కలగకుండా కొనసాగిస్తోందని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు తెలిపారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. శతజయంతి జరుపుకునే 2025 సంవత్సరం ఏడాది పొడవునా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకునేందుకు ప్రశాంతి నిలయానికి వచ్చే భక్తులకు నిత్య అన్నదానం పథకం ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు.

క్లుప్తంగా

బాబా అవతార ప్రకటన క్షేత్రంలో ప్రత్యేక పూజలు



రాతిగుండుకు విశేష అలంకరణ చేసిన దృశ్యం

ఉరవకొండ: ప్రపంచ దేశాలకు ప్రేమతత్వాన్ని చాటి నడియాడే దేవుడిగా ఖ్యాతిగాంచిన భగవాన్ సత్యసాయిబాబా అవతార ప్రకటన క్షేత్రంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. సత్యసాయి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని ఉరవకొండలోని బాబా అవతార ప్రకటన క్షేత్రం భక్తులతో పోటెత్తింది. బాబా అవతార ప్రకటన చేసిన రాతిగుండును విశేష పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, భజనలు,పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఒకే ఒక్క చాన్స్ ఇవ్వండి ప్లీజ్!

- ఎస్కేయూ అధికారులకు డిగ్రీ కోర్సు కాలపరిమితి దాటిన 4,600 మంది విద్యార్థుల వేడుకోలు
- వీరిలో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయిన వారే అధికం
- ప్రాక్టికల్స్‌లోనూ ఫెయిల్ అయి అవకాశం కోసం ఎదురుచూపు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వెసులుబాటు కల్పించే అధికారం వర్సిటీ అధికారులకు ఉన్నా... ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. ఫలితంగా కోర్సు కాలపరిమితి దాటినా విద్యార్థులకు నిరీక్షణ తప్పడం లేదు.

సెమిస్టర్ విధానం అమలుతో తిప్పలు..

తొలిసారిగా సెమిస్టర్ విధానాన్ని 2016–17 విద్యా సంవత్సరం డిగ్రీ తొలి బ్యాచ్ విద్యార్థులకు అమల్లోకి తెచ్చారు. ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం విధానం కావడం, తొలి దఫా సెమిస్టర్ పద్ధతి కావడంతో అభ్యసన ప్రక్రియలో చాలా మంది విద్యార్థులు వెనుకబడ్డారు. అధిక సిలబస్ కావడం, ఏడాదికో దఫా కాకుండా ప్రతి సెమిస్టర్‌కు పబ్లిక్ పరీక్ష నిర్వహిస్తుండడంతో వేగవంతమైన అభ్యసన ప్రక్రియలో తడబాటు మొదలైంది. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత విద్యార్థులు అందుకు తగ్గట్టు సంసిద్ధం కాలేకపోయారు. దీంతో ఇబ్బడిముబ్బడిగా ఫెయిల్ అయ్యారు. 2016–17 బ్యాచ్‌కు చెందిన 4,600 మంది విద్యార్థులు గట్టెక్కలేక చతికిలపడ్డారు.

గరిష్ట కాలపరిమితి దాటినా..

డిగ్రీ కోర్సు కనిష్ట కాల వ్యవధి మూడేళ్లు కాగా, గరిష్టంగా ఆరేళ్లలో పూర్తి చేయాలి. ఆరేళ్ల గరిష్ట కాల వ్యవధి దాటితే డిగ్రీ కోర్సు రద్దయినట్లు కాదు కానీ, గతంలో ఎన్నో దఫాలుగా విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి అవకాశం కల్పించినా ఆశించిన మేర ఫలితాలు దక్కలేదు. 2012 నుంచి 2015 బ్యాచ్ విద్యార్థుల వరకూ గరిష్ట కాల పరిమితి దాటినప్పటికీ వెసులుబాటు ఇచ్చారు. అయినా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో విసుగు చెందిన ఎస్కేయూ ఉన్నతాధికారులు ఇకపై ఎలాంటి అవకాశం ఇచ్చేది లేదంటూ కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

సింహభాగం ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన వారే

కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో 2020, 2021 విద్యా సంవత్సరాల్లో అభ్యసన ప్రక్రియ సజావుగా జరగలేదు. ఎస్ఎస్‌సీ బోర్డు నుంచి వర్సిటీ స్థాయి పరీక్షల వరకు వెసులుబాటు కల్పిస్తూ వేలాది మందిని ఉత్తీర్ణులుగా ప్రకటించారు. దీంతో అభ్యసనలో నాణ్యత లోపించింది. డిగ్రీలో ఒకే ఒక్క సబ్జెక్ట్‌లో ఫెయిలైన వారిలో 2016 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. ప్రాక్టికల్స్ గైర్హాజరయిన వారే సింహభాగం ఉన్నారు. వీరంతా గతంలో ఇచ్చిన తరహాలోనే మరో దఫా అవకాశం ఇవ్వాలని విన్నవించుకుంటున్నా కనికరించేవారు లేరు.

పీహెచ్‌డీ విద్యార్థులపై ప్రతాపం..

2016 మార్గదర్శకాల మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్ పొందిన విద్యార్థులు తమను వర్సిటీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నఫలంగా 2016 మార్గదర్శకాల నుంచి 2019 మార్గదర్శకాల పరిధిలో పరిశోధన చేయాలని నిర్ణయం తీసుకోవడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. 2016 మార్గదర్శకాల కంటే 2019 మార్గదర్శకాలు పూర్తి కఠినంగా ఉన్నాయి. ఏ సమయంలో అడ్మిషన్ పొంది ఉంటే వాటి ప్రకారమే పరిశోధనలకు అవకాశం కల్పించాల్సి ఉన్నప్పటికీ, ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దీంతో మొత్తం 69 మంది విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారింది. 2019 మార్గదర్శకాల మేరకు సెమినార్లు, జర్నల్స్ ప్రచురణ, విదేశీ వర్సిటీలతో థీసిస్ మూల్యాంకనం తదితర అంశాలను నెరవేర్చాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 2019 పరిశోధన మార్గదర్శకాల ప్రకారం పీహెచ్‌డీ పూర్తి చేయాలంటే మరో రెండు, మూడు సంవత్సరాల సమయం అనివార్యమవుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

2016 బ్యాచ్‌లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులే అత్యధికంగా ఉన్నారు. వీరంతా ఉత్తీర్ణత సాధించేలా అవకాశం కల్పించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం రాలేదు.

– ప్రొఫెసర్ జీవీ రమణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, ఎస్కేయూ

సీఎం పర్యటనను విజయవంతం చేయండి



కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగనన్న వసతి దీవెన నగదు జమ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 26న సీఎం నార్పల వస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. జగనన్న వసతి దీవెన పథకం ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఉన్నత విద్య కోసం సీఎం పెద్ద పీట వేస్తున్నారని గుర్తుచేశారు.

ఇండియన్ ఉమెన్ లీగ్ ఫుట్‌బాల్ కోచ్‌గా అంజలి



అనంతపురం సప్తగిరి సర్కిల్: ఇండియన్ ఉమెన్స్ లీగ్ ఫుట్‌బాల్ గోల్ కీపర్ కోచ్‌గా కళ్యాణదుర్గానికి చెందిన అంజలి ఎంపికయ్యారు. ఇండియన్ ఉమెన్స్ లీగ్ క్రీడా పోటీలు ఈ నెల 26 నుంచి మే 13వ తేదీ వరకూ అహమ్మదాబాద్ వేదికగా జరగనున్నాయి. ఈ పోటీల్లో అందరి దృష్టిని కేంద్రీకృతం చేసుకున్న ముంబయి నైట్స్ క్లబ్ జట్టుకు ఆమె కోచ్‌గా వ్యవహరించనున్నారు. అనంతపురం ఫుట్‌బాల్ అకాడమీలో బాలికల కోచ్‌గా పనిచేస్తున్న అంజలికి అరుదైన అవకాశం దక్కడంపై ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీ కో–ఆర్డినేటర్ దాదాఖలందర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి మహిళా కూలీ మృతి



చంద్రకళ (ఫైల్)

బెళుగుప్ప: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ మహిళా కూలీ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లికి చెందిన చంద్రకళ (40), శ్రీనివాసులు దంపతులు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం కాలువపల్లి సమీపంలో వేరుశనగ పంట నూర్పిడి పనులకు తోటి కూలీలతో కలసి చంద్రకళ ట్రాక్టర్‌లో బయలుదేరింది. ఇంజన్ వద్ద కూర్చొని ప్రయాణిస్తున్న ఆమె కాలువపల్లి సమీపంలో మలుపు వద్దకు చేరుకోగానే ట్రాక్టర్ కుదుపులకు అదుపు తప్పి టైర్ కిందపడి అపస్మారక స్థితికి చేరుకుంది. తోటి కూలీలు, బంధువులు వెంటనే ఆమెను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. ఆమె ఛాతీ మీదుగా ట్రాక్టర్ చక్రం వెళ్లడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఎస్ఐ రామకృష్ణయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి హల్‌చల్

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి మునిసిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి మళ్లీ హల్‌చల్ చేశారు. మునిసిపల్ అధికారులు తన మాట వినలేదంటూ సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో టీడీపీ కౌన్సిలర్లతో వంటావార్పునకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రభాకర్‌రెడ్డి మునిసిపల్ కార్యాలయానికి అనుచరులతో కలిసి వెళ్లి హంగామా చేయాలని చూశారు. అయితే పోలీసులు అడ్డుకుని ఆయన నివాసానికి తరలించారు. అంతటితో ఆగని ప్రభాకర్‌రెడ్డి తన ఇంటి గేటు బయట కుర్చీ వేసుకుని కూర్చొని ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించారు. పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. పైగా పోలీసులను దూషిస్తూ వారి పట్ల దురుసుగా వ్యవహరించారు. డీఎస్పీ వీఎన్‌కే చైతన్య ఆదేశాలతో సిబ్బంది ప్రభాకర్‌రెడ్డిని ఎత్తుకుని ఆయన నివాసంలోకి తీసుకెళ్లారు. ఇదిలాఉండగా.. జేసీ ప్రభాకరరెడ్డి కొద్ది రోజులుగా మునిసిపల్ కమిషనర్ జబ్బార్‌మియాతో పాటు కిందిస్థాయి అధికారులను, సిబ్బందిని టార్గెట్ చేస్తున్నారు. తన మాట వినలేదనే అక్కసుతో బ్లాక్ మెయిలింగ్‌కు దిగారు. అధికారుల అంతు చూస్తానని బెదిరించడమే కాకుండా తాము అధికారంలోకి వస్తే అధికారుల ఇళ్లు కూలగొడతామంటూ మానసిక క్షోభకు గురిచేస్తున్నట్లు మునిసిపల్ అధికారులు వాపోతున్నారు.

ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా జింకల రామాంజనేయులు



అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ అనుబంధ ఎస్సీ విభాగం జోనల్ (అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య) ఇన్‌చార్జ్‌గా జింకల రామాంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జింకల రామాంజనేయులు గతంలో గుంతకల్లు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీలో జేసీఎస్ కన్వీనర్‌గా ఉన్నారు. జోనల్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తనకు ఈ పదవి దక్కేందుకు సహకరించిన గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారానికి తెరలేపాయని, వీటిని నమ్మబోరాదని ప్రజలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సూచించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం రాప్తాడు జేసీఎస్ కన్వీనర్లతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను సెల్‌ఫోన్లకు, ఇళ్లకు అతికించుకోకపోతే సంక్షేమ పథకాలు తొలగిస్తామని లబ్ధిదారులను గృహసారథులు బెదిరిస్తున్నట్లు టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. ఇలా ఎన్నటికీ జరగదన్నారు. సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను ఇంటి వద్దకే అందజేస్తున్నామన్నారు. ఇలాంటి చవకబారు వదంతులను ఎవరూ నమ్మబోరాదని కోరారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్లు హరినాథరెడ్డి, నరసింహారెడ్డి, శ్యామ్ సుందర్, బోయ రామాంజనేయులు, జయచంద్రారెడ్డి, నాగమల్లేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వారు అభివృద్ధి నిరోధకులు

- వంటావార్పులు మాని పట్టణాభివృద్ధిపై దృష్టి సారించండి
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల హితవు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

తాడిపత్రి: పట్టణాభివృద్ధికి ఏమాత్రం సహకరించకుండా అభివృద్ధి నిరోధకులుగా మారారంటూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డితో పాటు టీడీపీ కౌన్సిలర్లపై పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని టీడీపీ కౌన్సిలర్లు విడిది కేంద్రంగా మార్చేకున్నారని దుయ్యబట్టారు. తాడిపత్రి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు రాఘవేంద్ర, రంగనాథరెడ్డి, ఆకుల చిన్న నాగిరెడ్డి, పార్టీ నాయకులు బాబు, సునీల్ తదితరులు మాట్లాడారు. అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తుంటే కోర్టుకు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటును, ఆంజనేయస్వామి మాన్యంలో నిరుపేదలకు పట్టాలు ఇచ్చేందుకు, రూ.200కే కొళ్లాయి కనెక్షన్ ఇచ్చేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కృషి చేస్తే దానినీ అడ్డుకున్నారన్నారు. పేదలకు మంచి చేస్తుంటే జేసీ ప్రభాకరరెడ్డి ఓర్వలేకపోతున్నాడని మండిపడ్డారు. నిబంధనలకు వ్యవహరిస్తున్న జేసీ ప్రభాకరరెడ్డిని నిలదీయకుండా నిజాయితీగా పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాను వేధిస్తూ వంటావార్పు కార్యక్రమం పేరుతో ప్రజలను పెడతోవ పట్టించే చర్యలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం తన కుమారుడికి టీడీపీ తరఫున ఎమ్మెల్యే టికెట్ దక్కించుకునేందుకు ఇలాంటి ఆర్భాటాలకు జేసీ ప్రభాకరరెడ్డి తెరతీస్తున్నాడని ఆరోపించారు. వంటావార్పులు మాని ప్రజలకు మేలు కలిగే పనులు చేపట్టాలని హితవు పలికారు. ప్రభుత్వాధికారులు నిబంధనలకు లోబడే విధులు నిర్వర్తిస్తారని , భయపెట్టి వారితో పనులు చేయించుకోవాలనుకోవడం అవివేకమన్నారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎండోమెంట్ సహాయ కమిషనర్ రామాంజనేయులు

అనంతపురం కల్చరల్: జిల్లాలోని ఆలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అర్చకుల సహకారం తీసుకుంటామని జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు స్పష్టం చేశారు. ఏపీ అర్చక సమాఖ్య నూతన కార్యవర్గం ఎంపిక సోమవారం జరిగింది. అనంతపురంలోని తపోవనంలో ఉన్న వేదమాత గాయత్రీదేవి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాయలసీమలోని అన్ని జిల్లాల నుంచి అర్చక ప్రతినిధులు హాజరయ్యారు. అర్చక సమాఖ్య వ్యవస్థాపకుడు పులమాచార్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటపాడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ, సహాయ కార్యదర్శి బసవరాజు, నూతన అధ్యక్షుడు పూజారి భీమప్ప, కార్యదర్శి శివశంకర శర్మ తదితరులు మాట్లాడారు. జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా సంఘాన్ని బలోపేతం చేయాలని తీర్మానించారు. ధూపదీప నైవేద్యాలకు అందిస్తున్న రూ.5 వేలను రూ.10 వేలకు పెంచాలని, అర్చకత్వంపై వంశపారంపర్య హక్కులను అమలు చేయాలని, 43 రిజిస్టర్‌లో అర్చకుల పేర్లు నమోదు చేసి రైతు భరోసా అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సభ్యత్వ నమోదు చేపట్టి, జిల్లా నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: మండలంలోని ఆవులదట్లలో మట్కా నిర్వహిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ యుగంధర్, ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం ఆవులదట్లలో తనిఖీలు చేపట్టగా మట్కా నిర్వాహకులు మంజునాథ నాయక్, మూడ్ నరేష్‌నాయక్, గొల్ల నాగేంద్ర, గుండ్లపల్లికి చెందిన జింకల తిప్పేస్వామి, మాల్యం వీరాంజినేయ పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.3.25 లక్షల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పోలీసు స్పందనకు 80 వినతులు



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 80 వినతులు అందాయి. ఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా బాధితుల నుంచి వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యల పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్‌ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేంద్రుడు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

తాడిపత్రి: వైఎస్సార్ జిల్లా తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి హరినారాయణరెడ్డిని హత్య చేసేందుకు ప్రయత్నించిన కేసులో 8 మంది నిందితులను సోమవారం తాడిపత్రి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 20న హరినారాయణరెడ్డి వెళ్తున్న కారును బొందలదిన్నె వద్ద క్యాంపర్ వాహనంతో ఢీకొట్టి హతమార్చేందుకు చేసిన ప్రయత్నం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసిన తాడిపత్రి రూరల్ పోలీసులు పక్కా ఆధారాలతో తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చిన్న అంకిరెడ్డి, అతని సోదరుడు రామసుబ్బారెడ్డితో పాటు మరో ఆరుగురిని సోమవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

దేవపుత్ర సాహిత్యం చిరస్మరణీయం

- ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి



అప్పలనాయుడుకు పురస్కారమందిస్తున్న అనంత సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: జిల్లా సాహిత్యంలో చిలుకూరి దేవపుత్రది ప్రత్యేక స్థానమని, ఆయన రచనలు ఎన్నో చిరస్మరణీయంగా నిలిచిపోయాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి కొనియాడారు. దివంగత చిలుకూరి దేవపుత్ర స్మారక సాహిత్య పురస్కారాన్ని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడుకు అందించారు. సోమవారం రాత్రి చిలుకూరి సాహితీ కుటుంబం ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయ భవన్ వేదికగా పురస్కార ప్రదానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. డాక్టర్ శాంతి నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య చంద్రశేఖరరెడ్డితో పాటు ప్రముఖ రచయితలు బండి నారాయణస్వామి, జి.వెంకటకృష్ణ, ఉప్పరపాటి వెంకటేశులు, చిలుకూరి లక్ష్మీదేవి, దీవెన తదితరులు మాట్లాడారు. సామాన్యుల పక్షం వహించి చిలుకూరి దేవపుత్ర వెలువరించిన ఎన్నో మానవీయ రచనలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. అదే ధోరణిలో అప్పలనాయుడు సైతం ఉత్తరాంధ్ర సాహిత్యంలో చేస్తున్న ప్రయోగాలు విలక్షణమైనవన్నారు. ఆయనను దేవపుత్ర పురస్కారానికి ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు, కవులు ఏలూరు యంగన్న, తరిమెల అమరనాథరెడ్డి, షెహనాజ్, శశికళ, నబీరసూల్, షరీఫ్, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, చెట్ల ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొక్కలు మానవాళికి రక్ష



కొబ్బరిమొక్క నాటుతున్న జేఎన్‌టీయూఏ వీసీ రంగజనార్దన

అనంతపురం: మొక్కలు మానవాళి భవితకు రక్ష అని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు (1962–77 బ్యాచ్)కు చెందిన విద్యార్థుల్లో ఒకరు పరాశక్తి సిమెంట్ కంపెనీ నిర్వహిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో క్యాంపస్‌లో 250 మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టడానికి సహకారం అందించారని వీసీ తెలిపారు. పూర్వ విద్యార్థులు వర్సిటీ పురోగతికి కృషి చేయడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, వర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి, ప్రొఫెసర్ సి.శోభాబిందు, ప్రొఫెసర్ కిరణ్మయి, ప్రొఫెసర్ భువన విజయ, ప్రొఫెసర్ పద్మసువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఆశా వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతి

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి అధ్యక్షతన జరిగిన ధర్నాలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి మాట్లాడారు. ఆశాలకు రూ.18 వేలు వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగ విరమణ తరవాత రూ.10 లక్షలు బెనిఫిట్ ఇవ్వాలన్నారు. ఆశాలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రాజారెడ్డి, జిల్లా నాయకులు రాజేశ్‌గౌడ్, కృష్ణుడు, ఆశా వర్కర్ల సంఘం నాయకురాళ్లు పార్వతి, భానుమతి, గౌతమి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరులో సర్పంచ్ ఆరోగ్యంరెడ్డి, వైస్ ఎంపీపీ నీలిమ చేతుల మీదుగా గ్రామంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు అతికిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సిద్ధి గణపతి ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకారంలో సిద్ధి గణపతి

అనంతపురం కల్చరల్: మూడురోజులుగా నగరంలోని రామనగర్‌లో కొలువైన శ్రీసిద్ధి గణపతి స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ముగిశాయి. ప్రధాన అర్చకులు గరుడాద్రి సురేష్‌కుమార్ నేతృత్వంలో ఉదయం సహస్ర మోదక హోమం, మంగళనీరాజనం, పూర్ణాహుతి జరిగాయి. 1008 కుడుములతో చేసిన హోమద్రవ్యాలను భక్తులకు వితరణ చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, ఆశీర్వచన సేవలు సంప్రదాయబద్ధంగా జరిగాయి.

కూల్ వాటర్ మిషన్ వితరణ



కూల్ వాటర్ మిషన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ బాబాఫకృద్దీన్

రాప్తాడురూరల్: అనంతపురం మండల ఉపాధ్యక్షుడు చియ్యేడు కృష్ణారెడ్డి ఎంపీడీఓ కార్యాలయానికి కూల్ వాటర్ మిషన్‌ను వితరణ చేశారు. కార్యాలయ సిబ్బందితో పాటు వివిధ పనులపై కార్యాలయానికి వస్తున్న ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వైస్ ఎంపీపీ కూల్ వాటర్ మిషన్ అందజేశారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం వాటర్ మిషన్‌ను ఎంపీడీఓ బాబాఫకృద్దీన్ ప్రారంభించారు.

నేడు హజ్ యాత్రికులకు శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని పీటీసీ ఎదుట ఉన్న చాందినీ మసీదులో హజ్ యాత్రికులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు హజ్ యాత్రికుల ఖాదిం మహమ్మద్ రఫీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి

రాప్తాడు: గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సాల్మన్ అధ్యక్షతన పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో అధికారులు పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్, గాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థతో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. మహిళలు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యారన్నారు. అనంతరం ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన సర్పంచులకు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, ఎంపీడీఓ సాల్మన్ అవార్డులను అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఈఓఆర్డీ మాధవి, ఏఓ రత్నబాయి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఏఓ శుభకర్, ఏపీఎం శివకుమార్, ఇంజినీర్ ఓబుల్ దాస్ పాల్గొన్నారు.



ఆత్మకూరు సర్పంచులకు ఉత్తమ పంచాయతీ పురస్కారాలు అందిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



రాప్తాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

ఉత్తమ పంచాయతీలుగా వడ్డుపల్లి, పంపనూరు

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి పంచాయితీ, పంపనూరు రెండు పంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామికి ఉత్తమ పంచాయతీ పురస్కారాలు అందించారు.

ప్రతి గ్రామాన్నీ ఆదర్శంగా నిలుపుదాం

ఆత్మకూరు: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రతి పంచాయతీలో సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పంచాయతీ అభివృద్ధిపై మాట్లాడారు. అనంతరం పంచాయతీరాజ్ పురస్కార పత్రాలను సర్పంచులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ విజయ్, నీలిమ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్, ఈవోఆర్డీ సత్యబాబు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

కనగానపల్లి: ప్రజాప్రతినిధులు, అధికారులు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. సోమవారంస్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదర్శ పంచాయతీలకు ప్రకటించిన సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు అందించారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రామగిరి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ ఆజాద్‌లు మాట్లాడారు. ఆయా పంచాయతీ అధికారులను సన్మానించి మెమొంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, ఈఓఆర్డీ రాధాకృష్ణ, సుబహాన్, శర్మ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో మెడికోల ప్రతిభ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ సోషల్ మెడిసిన్ ఏపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో అనంత మెడికోలు సత్తా చాటారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అధ్యక్షతన సామాజిక వైద్య శాస్త్రం, వ్యాధుల నియంత్రణ అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 45 మంది విద్యార్థులు 15 బృందాలుగా హాజరయ్యారు. ఈ క్విజ్ పోటీలకు నోడల్ అధికారిగా డాక్టర్ సుమన గోపీచంద్ వ్యవహరించారు. క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతిని సంజు సత్యన్, సాయికిరణ్, విజయసింహారెడ్డి గెలుపొందారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ షారోన్ సోనియా వారికి ప్రశంసాపత్రాలు అందించారు.



క్విజ్ పోటీల్లో సత్తా చాటిన మెడికోలు

కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ తెలుగు మధుసూదన్, డాక్టర్ శ్యాంప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శంకర్‌నారాయణ, డాక్టర్ సుమన గోపీచంద్, డాక్టర్ నిహారిక, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘అనంత’తోనే అభివృద్ధి సాధ్యం

అనంతపురం రూరల్: అనంతపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏ నారాయణపురం నుంచి నరసనాయన కుంటకు వెళ్లే రహదారిలో తడకలేరుపై ఏర్పాటు చేయనున్న బ్రిడ్జి నిర్మాణానికి సోమవారం ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీ నాగేంద్ర, మాజీ సర్పంచ్ ఉమ్మడి జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, రామాంజులరెడ్డి, ఉమ్మడి మనోజ్‌రెడ్డి, పోతులయ్య, గువ్వల రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, సత్యన్న, లక్ష్మీనారాయణ, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఖేలో ఇండియా కోచ్‌పై చర్యలు ఏవీ?

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలోని ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రవీంద్రపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. క్రీడాకారులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన కోచ్.. క్రీడాకారులపై అనుచితంగా వ్యవహరిస్తుండడంపై క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆందోళన చెందుతున్నారు. అతన్ని విధుల నుంచి తొలగించాలని క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధిత అధికారులు విచారణాధికారిని నియమించి, విచారణ పూర్తి చేసి నెలన్నర రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హర్షవర్ధన్‌ను ఈ నెల 16న క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు కలిసి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర శాప్ మేనేజింగ్ డైరెక్టర్ మరోసారి మంగళవారం జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆయన్ను కలిసి మరోసారి విన్నవించేందుకు తల్లిదండ్రులు, క్రీడాకారులు, విద్యార్థి సంఘాల నాయకులు సిద్ధమవుతున్నారు. ఈ విషయంపై జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కోచ్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి విచారణను పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపామన్నారు. వారి నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

విధులకు డుమ్మా కొడితే టర్మినేట్ చేస్తా

- ఇంజినీరింగ్ కార్మికులపై కమిషనర్ రమణారెడ్డి ఆగ్రహం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్మికులు విధుల్లో లేకపోతే టర్మినేట్ చేసేందుకు వెనుకాడనని కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. సోమవారం నగరపాలక సంస్థ ఆవరణంలో పార్క్‌ల్లో విధులు నిర్వర్తించే కార్మికులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 60 మంది కార్మికుల్లో 12 మంది గైర్హాజరవడంతో వారికి ఒక రోజు వేతనం కోత విధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్, నీరు ప్రగతి వనం, రెండో రోడ్డు పార్క్‌లలో విధులు నిర్వర్తించే సిబ్బందిపై కమిషనర్ ఆరా తీశారు 15 మందిలో ఒకరిద్దరు మినహా మిగితా వారు కనిపించకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన శ్రీనగర్ కాలనీలోని నీటి ట్యాంకును పరిశీలించారు. అనంతరం కొత్తూరు నగరపాలక సంస్థ కాంప్లెక్స్‌ను పరిశీలించి శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని ఆదేశించారు.



నగరపాలక సంస్థ ఆవరణంలో ఇంజినీరింగ్ కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అద్వైతంతోనే సమస్త విజ్ఞానం

అనంతపురం కల్చరల్: శారదానగర్‌లోని శ్రీ శంకర మఠంలో శంకర జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలతో పాటు ఆదిశంకరుల సాహిత్యంపై ప్రసంగ కార్యక్రమం జరిగింది. డాక్టర్ పతికి రమేష్‌నారాయణ మాట్లాడుతూ ఆదిశంకర భగవత్పాదులు ప్రవచించిన అద్వైతంలోనే సమస్త విజ్ఞానం దాగుందని, హైందవ మతం ఇబ్బందుల్లో పడినప్పుడు దేశవ్యాప్తంగా భారతీయ ధర్మాన్ని కాపాడిన విధం గురించి చెప్పినతీరు ఆకట్టుకుంది. అనంతరం సిరివరం రామచంద్రరావు, మఠం మేనేజర్ సత్యప్రసాద్, ఆశుకవి రియాజుద్దీన్ తదితరులు రమేష్ నారాయణను సత్కరించారు.

నేడు శంకర జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్: అద్వైత మత సంస్థాపనాచార్యులు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలకు శంకర మఠాలు సిద్ధమయ్యాయి. నగరంలో శారదానగర్‌లోని శారదా శంకర మఠం దశాబ్దాల కిందటే నిర్మాణమైంది. మాజీ డీజీపీ రొద్దం ప్రభాకరరావు నేతృత్వంలో శంకర మఠం ఏర్పడింది. ఉచిత సామూహిక ఉపనయనాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. మంగళవారం ఆలయంలో ఉదయం శ్రీ శారదా శంకరులకు అభిషేకాలు, ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. మొదటిరోడ్డు శివాలయ ప్రాంగణంలో నిర్మాణమైన శంకర మఠంలో బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం వారు శంకర జయంతి వేడుకలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకాల అనంతరం నగరోత్సవం ఉంటుందని నిర్వాహకుడు సాయి శివరాం తెలిపారు.

నేనింతే.. నన్నేమీ అడగకూడదంతే..!

- ‘నర్సింగ్’ ఉన్నతాధికారి ఇష్టారాజ్యంగా విధులు



అనంతపురం సప్తగిరి సర్కిల్: నగర శివారులోని కళాశాలకు ఇటీవల బదిలీపై వచ్చిన ఉన్నతాధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విధులకు తరచూ డుమ్మా కొడుతున్నారు. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో ఎవరికీ తెలియడం లేదు. అయినా సరే హాజరైనట్టు రిజిష్టర్‌లో సంతకాలు ఉంటాయి. ఎవరైనా తనను ప్రశ్నించినా.. విధుల గురించి ప్రస్తావించినా శివాలెత్తిపోతారు. తన గురించి ఎవ్వరూ మాట్లాడ కూడదని హుకుం జారీ చేస్తున్నారు. కాదని ఎవరైనా గుసగుసలాడితే కక్ష కడుతున్నారు. ఈమె వ్యవహార శైలిపై విసుగెత్తిన సిబ్బంది పై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని పై అధికారులు నోటీసులు జారీ చేశారు. విషయం తెలుసుకున్న నర్సింగ్ కళాశాల ఉన్నతాధికారి తనపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ సిబ్బందిపై కక్ష గట్టారు. ఇంక్రిమెంట్లకు ఇబ్బంది కలిగేలా రిజిష్టర్‌లో కాలమ్స్ ఖాళీ పెట్టి పైశాచికానందం పొందుతున్నారు.

రిజర్వేషన్లు తొలగిస్తామనడం బాధాకరం

అనంతపురం సప్తగిరి సర్కిల్: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ముస్లింల రిజర్వేషన్లను తొలగిస్తామనడం బాధాకరమని జాతీయ బహుళార్థక సంక్షేమ సంఘం చైర్మన్ డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూ ర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కేంద్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలను ముస్లింలు, ముస్లిం సమాజం పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో బీసీ, ఎస్సీల కంటే ముస్లింలు దీన స్థితిలో ఉన్నారన్నారు. ముస్లిం మైనార్టీలకు అందించిన రిజర్వేషన్‌తోనే విద్యా, ఉద్యోగాల్లో రాణిస్తున్నారన్నారు. ముస్లిం స్థితిగతులపై సచార్ కమిటీ, మిశ్రా కమిషన్, కుందూ నివేదికలను పరిశీలించాలని ఆయన కోరారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరాలయ శతాబ్ది ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం శతాబ్ది ఉత్సవాలు రెండోరోజూ ఘనంగా సాగాయి. సోమవారం అహోబిళం పీఠం ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలాచార్యులు పీఠ పూజలు, శ్రీసీతారామ, లక్ష్మణ సమేత యోగాంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అనుగ్రహ భాషణంలో భక్తిమార్గంపై వివరించారు. వేర్వేరు ప్రదేశాల నుంచి హాజరైన రుత్వికులు శ్రీలక్ష్మీనారాయణ, రుద్ర, సహస్రమోదుక హోమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ అనువంశీకులు హోసూరు సుబ్రమణ్యం నేతృత్వంలో ఏకాదశ రుద్రాభిషేకాలు, సాయంత్రం శ్రీలలితా, విష్ణు సహస్రనామపారాయణం, అనంతరం సంస్కృత పండితులు డాక్టర్ నాగత్రిశూల పాణి ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది.



హోమాలు చేయిస్తున్న వేదపండితులు

స్పందనలో ఆరు వినతులు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ఆరు ఫిర్యాదులు అందాయి. నగరపాలక సంస్థ మేనేజర్ లక్ష్మీదేవి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, సూపరింటెండెంట్లు ఖయూం, విజయ్‌కుమార్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

దాసగాని కృష్ణమూర్తికి గుర్రంజాషువా పురస్కారం



అవార్డునందుకుంటున్న దాసగాని కృష్ణమూర్తి

అనంతపురం కల్చరల్: మహాబోధి సాహిత్య వేదిక ద్వారా దశాబ్దాలుగా సాహిత్య సేవలందిస్తున్న దాసగాని కృష్ణమూర్తికి గుర్రం జాషువా అవార్డు అందించారు. సోమవారం తెనాలిలో గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ సంస్థ ఆధ్వర్యంలో పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే శివకుమార్, గజల్ శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి రామచంద్రుడు తదితరులు హాజరై సాహిత్య కళాభూషణ్ బిరుదుతో సత్కరించారు.

39 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల సిబ్బంది

అనంతపురం రూరల్: స్మార్ట్ బ్రెన్, టెక్నాలజీ ఐటీ సంస్థ ఆధ్వర్యంలో పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 39 మందికి ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని టెక్నికల్ అనలిస్టులుగా నియమిస్తారని, వార్షిక వేతనం రూ. 2.5 లక్షలు ఉంటుందన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



రామినేపల్లిలో'జగనన్న మా భవిష్యత్తు పోస్టర్ల'ను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి

రాప్తాడు: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి అన్నారు. మండలంలోని రామినేపల్లిలో ‘జగనన్న మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని వివరించి, ఇంటి యాజమాని అనుమతితో ‘మా నమ్మకం నువ్వే జగన్’ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నల రవికుమార్, పెద్దన్న, నాగరాజు, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పన్ను రూ.59 లక్షలు వసూలు

అనంతపురం క్రైం: ఇంటి, నీటి, ఖాళీ జాగా పన్ను రూ.59 లక్షలు వసూలైంది. ఈ నెలాఖరు వరకు రాయితీ అవకాశం ఉంటుందని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో పన్ను ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పించిన విషయం విదితమే. నగరపాలక సంస్థలో నాలుగు కౌంటర్లు, నవోదయ కాలనీ, రెండో రోడ్డు, రాంనగర్, పాతూరులోని సచివాలయాల్లో పన్ను చెల్లించే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

క్రైం సమాచారం

అన్నం పెట్టమని అడిగితే గొడవ

రాప్తాడురూరల్: అన్నం పెట్టమని అడిగిన భర్తతో గొడవపడి భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నంపల్లి సునీతమ్మ కొట్టాలలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. లక్ష్మన్న, హనుమక్క దంపతులు సునీతమ్మ కొట్టాలలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. లక్ష్మన్న, హనుమక్క కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 22న రాత్రి మద్యంమత్తులో ఇంటికి వచ్చిన లక్ష్మన్న.. భార్యను అన్నం పెట్టాలని అడిగితే ఆమె కోపగించుకుంది. దీంతో ఇద్దరూ వాదోపవాదాలు చేసుకొని, అన్నం తిని నిద్రించారు. అందరూ నిద్రపోయిన తర్వాత హనుమక్క ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఉదయం లేచి చూడగానే హనుమక్క కనిపించకపోయే సరికి కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు, బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీశారు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనుమక్క ఆచూకీ తెలిస్తే 94407 96811 (సీఐ), 93469 17102 (ఎస్‌ఐ) నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

స్వీపర్ పోస్టు ఇప్పిస్తానని వంచన

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: హాస్టల్‌లో స్వీపర్ పోస్టు ఇప్పిస్తానని బాల పెద్దన్న అనే వ్యక్తి నమ్మబలికి మోసం చేశాడని అంబేద్కర్‌నగర్‌కు చెందిన అరుణకుమారి అనే మహిళ వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేసింది. అరుణకుమారికి ఆరు నెలల క్రితం ఉద్యోగం ఇప్పిస్తాననిబాలపెద్దన్న నమ్మబలికాడు. ఉద్యోగం ఇప్పించక పోగా తాము ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

దివ్యాంగుడిపై దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక లక్ష్మీనగరులో దివ్యాంగుడు బాబా ఫకృద్దీన్‌పై గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు సోమవారం రాత్రి దాడి చేశారు. ఇంటి నుంచి వీధిలోకి వచ్చిన అతన్ని ముగ్గురు వ్యక్తులు చుట్టుముట్టి ఇష్టారాజ్యంగా దాడి చేయండంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా చికిత్సనందించిన వైద్యులు పరిస్థితి అదుపులో ఉన్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని బిందెల కాలనీకి చెందిన షేక్‌అలీ కుటుంబ కలహాలతో పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సకాలంలో కుటుంబ సభ్యులు గుర్తించి అతన్ని చికిత్స నిమిత్తం సోమవారం రాత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భార్యాభర్తల గొడవపై కేసుల నమోదు

రాప్తాడురూరల్: భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ కారణంగా ఇరు కుటుంబాలపై అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు..కక్కలపల్లికి చెందిన జాహ్నవికి కూడేరు మండలం అరవకూరుకు చెందిన అనిల్‌తో రెండేళ్లక్రితం వివాహమైంది. వీరికి కూతురు సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో జాహ్నవి పుట్టింట్లోనే ఉంటోంది. పలుమార్లు పంచాయతీలు చేశారు. ఆదివారం భర్తతో పాటు బంధువులు ఆమె ఇంటికి వెళ్లారు. మాటామాటా పెరిగి దాడులు చేసుకున్నారు. జాహ్నవి ఫిర్యాదుతో భర్త అనిల్, లోకేష్, ముసలన్న, రామచంద్రలపై కేసు నమోదు చేశారు. అనిల్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు జాహ్నవి బంధువులు తులశమ్మ, హనుమంతుపై పోలీసులు కేసు నమోదు చేశారు.